భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌ల సమస్య పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఈనెల 20వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం డి.ఎస్.ఆర్ అమర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో జూన్ 20న జరగబోయే మహాధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నటువంటి సుమారుగా 45 వేల క్లైములు డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం

ఏర్పడినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికులను చిన్న చూపు చూడడమే కాకుండా సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసే దుర్మార్గపు ఆలోచనలో జగన్మోహన్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. ఒక పక్క కరోనా, మరో పక్క ఇసుక దొరక కుండా చేసి, సిమెంటు, ఐరెన్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో భవన నిర్మాణరంగం కుదేలు అయిపోయి కార్మికుల కుటుంబాలు గడవక పనులు లేక ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లల్ని చదివించుకోలేక, కూతుళ్ళకి పెళ్లిళ్ళు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనేకమంది కార్మికులు ఆత్మహత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన 1200 కోట్లు సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకి జమ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మిక నిధులను వారి ప్రయోజనం కోసం ఖర్చు పెట్టాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గత మూడు సంవత్సరాలుగా ఎమ్మెల్యేల నుండి మంత్రులకి, ముఖ్యమంత్రి వరకు, జిల్లా రెవెన్యూ, లేబర్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి ఆందోళన చేస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. 1996 చట్టాన్ని గౌరవించి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించి గత ప్రభుత్వాల మాదిరిగా ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. గురువారెడ్డి, కార్యదర్శి ఆల్తి మారయ్య, సరగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏ వ్యాధి ఉన్నవారైనా ఫ్యామిలీ ఫిజిషియన్‌కే రావాలి

కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ నిర్వహిస్తున్నపుడు ఆ గ్రామంలో ఏ వ్యాధి ఉన్న వారైనా ఈ.ఎఫ్.పి.సి కార్యక్రమానికే హాజరు కావాలని, వేరే ఆసుపత్రులకు వెళ్ళకూడదని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వచ్చిన ప్రతి ఒక్కరికి బి.పి, షుగర్, కాన్సర్ వంటి వ్యాధులు గుర్తించి వారి వివరాలను ఆయా యాప్ లలో అప్లోడ్ చేయాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో డి.ఎం.హెచ్.ఓ డా. ఎస్.భాస్కరరావుతో కలసి వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీజనల్ వ్యాధులు, గర్భిణీల, బాలింతల, కిషోర బాలలకు హీమోగ్లోబిన్ పరీక్షలు, ఎన్‌సిడిసిడి సర్వే, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు, సుస్థిర అభివృద్ధి సూచీలు మాతా శిశు మరణాలు తదితర అంశాలపై పి.హెచ్.సి వారీగా సమీక్షించారు. ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గాలని, 9 నెలల్లో ఒక్కసారైనా గర్భిణీలకు తప్పనిసరిగా మొత్తం బాడీ పరీక్షలు జరపాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు రెగ్యులర్‌గా రక్త పరీక్షలు జరిపి అనీమియా రాకుండా తగు వైద్యం అందించాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలను తనిఖీ చేసి కిషోర బాలలలో రక్త హీనత లేకుండా చూడాలన్నారు. ప్రతి 3 నెలలకు ఒక్కసారి తప్పనిసరిగా పాఠశాలలకు వైద్యులు వెళ్ళాలని అన్నారు. రక్త హీనతతో బాధపడేవారు రెగ్యులర్‌గా మాత్రలు వేసుకునేలా ఆశ కార్య కర్తల ద్వారా మానిటర్ చేయాలన్నారు. వర్షా కాలం మొదలవుతున్నందున మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించాలని, అంటువ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

సుస్థిర అభివృద్ధి సూచీలలో వైద్య శాఖకు సంబంధిన సూచీలే ఎక్కువగా ఉన్నాయని, 2027 నాటికి శత శాతం సాధించాలనే లక్ష్యం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పని చేయాలన్నారు. ఈ సూచీలలో మాతా శిశు మరణాలు, రక్త హీనత, పిల్లల బరువు, ఇమ్మ్యునైజేషన్, తదితర అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఉందని తెలిపారు. అన్ని సూచీలలో పురోగతి కనపడాలని, ఖచ్చితమైన అంకెలను అప్లోడ్ చేయాలని అన్నారు. కంటి వెలుగు ప్రభుత్వ ప్రాధాన్య పథకమని, జిల్లాలో ఇప్పటివరకు 68 శాతం పరీ క్షలు జరిపారని, మిగిలిన వారికి కూడా పూర్తి చేయాలని ఇందు కోసం 13 బృందాలు జిల్లాలో పని చేస్తున్నాయని అన్నారు. పి.హెచ్. సిలలో నాడు నేడు క్రింద చేపట్టిన మరమ్మతులు, నూతన భవనాల పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్, జిల్లా అంధత్వ నివా రణా అధికారి, మలేరియా అధికారి పాల్గొన్నారు.

అటవీశాఖకు 69.48 ఎకరాల కొండ మెట్ట అప్పగింత

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం పెదఖండేపల్లి గ్రామంలో గల సర్వే నెంబరు 108లో 69.48 ఎకరాల కొండ మెట్ట భూములను అటవీ శాఖకు అప్పగి ంచామని తహశీల్దార్ డి.శ్రీనివాసరావు వెల్లడించారు. పెదఖండేపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కొండ మెట్టను అటవీ శాఖకు అప్పగించే ప్రక్రియపై ముందుగా స్థానిక రైతులు, పలు గ్రామాల ఆక్రమణదారులతో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్.కోట, మెంటాడ, పాచిపెంట, కురుపాం, సాలూరు మండలాల్లో మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్లు ఏర్పాటు నిమిత్తం అటవీ శాఖకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని, ఆయా చోట్ల తీసుకున్న భూమికి బదులు అటవీ శాఖకు పెదఖండేపల్లిలో గల 69.48 ఎకరాల కొండమెట్టను స్వాధీనం చేయటం జరిగిందని వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఇకపై కొండమెట్ట భూముల్లోకి రైతులు, ఆక్రమణదారులు విడిచి పెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక్కడి మెట్టపై పెదఖండేపల్లి, కృష్ణాపురం, ధర్మవరం గ్రామాలకు చెందిన 10 మంది ఆక్రమణదారులు మామిడి, జీడి, పామాయిల్ వంటి తోటలు సాగు చేస్తున్నారని గుర్తించారన్నారు. వారందరితో కలిసి అటవీ శాఖ వనసంరక్షణ సమితి ఏర్పాటు చేస్తుందని, వచ్చిన ఫలసాయాన్ని పొందవచ్చునని సూచించారు. అంతేకాకుండా కొండమెట్టపై అటవీశాఖ మరింతగా అడవుల పెంపకాన్ని చేపడుతుందని ఈ ప్రాంత రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఇకమీదట కొండమెట్టపై గల వనసంపద తరలిపోకుండా అటవీ శాఖ గార్డులు, రేంజ్ అధికారులు పర్యవేక్షణ కూడా ఉంటుందని డీఎఫ్ఓ వెంకటేష్ వివరించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ యాళ్ల రమణ, ఎంపీటీసీ బోదల దేముడు, మండల సర్వేయర్ వెంకటరావు, వీఆర్వో, పంచాయతీ రాజ్ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కొత్తవలస: సీజనల్ వ్యాధులు, మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా. గోపాలకృష్ణ, డా. సింహాద్రి నాయుడు అన్నారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ముందుగా అవగాహన చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పి.హెచ్.సి. సిబ్బంది, ఆశ వర్కర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎం.పి.హెచ్.ఈ.ఓ. వి.నరసింహారావు మాట్లాడుతూ జూన్ నుండి అక్టోబర్ వరకు వర్షా కాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని, ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎస్.జగదాంబ ఎం.పి.హెచ్.ఈ.లు నరసింహారావు, తిరు, హెచ్.వి. పద్మావతి, హెచ్.ఎస్.ఈశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్‌లు సత్యారావు, ఈశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కోటి చెరువు భూముల కబ్జాలపై సమగ్ర సర్వే జరపాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలోని నాయుడు కాలనీ పక్కనే ఉన్న కోటిచెరువు భూములను కొంతమంది భూకబ్జాదారులు జిరాయితీ భూములుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, కోటి చెరువును పూర్తిగా కనుమరుగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అటువంటి వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని కోటి చెరువు భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. తక్షణమే సమగ్ర సర్వే జరిపి కోటి చెరువు పూర్తి స్థాయిలో విస్తీర్ణం గుర్తించి ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అమ్మి గారి కోనేరు గట్టుపైన అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని, పట్టణంలో జరుగుతున్న పలు భూ కుంభకోణాలపైన తహ శీల్దార్ రాజారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి పట్టణ, మండల పరిధిలో పలు ప్రభుత్వ చెరువుల భూములు అన్యాక్రాంతం అవుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలం చెందారని ఆరోపించారు. ఇదే కోటి చెరువు భూఆక్రమణలపైన చర్యలు తీసుకోవాలని పలుమార్లు రెవెన్యూ యంత్రాంగానికి తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వలనే ఇప్పుడు కోటి చెరువును సగానికి పైగా కబ్జా చేయడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగిస్తున్నారని అన్నారు. కావున తక్షణమే రెవెన్యూ యంత్రాంగం స్పందించి కోటి చెరువులో ఆక్రమణలపై రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, సీపీఐ పట్టణ నాయకులు బోగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతంలో వరల్డ్ పెస్ట్ అవేర్‌నెస్ డే

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళశవారం వంర్ల్డ్ పెస్ట్ అవేర్‌నెస్‌పై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెస్ట్ క్యూర్ సొల్యూషన్స్, డి.కె.యస్ ప్యాలెట్స్ అండ్ ఫర్నీచర్ ప్రైవేట్ లిమిటెడ్, వైజాగ్ వ్యవస్థాపకులు, సి.ఎం.వో డి.ప్రకాశరావు ఈ ఏడాది వరల్డ్ పెస్ట్ డే అంశం అయిన చెద నియంత్రణకు స్థిరమైన పరిష్కారాలు గూర్చి వివరించారు. ప్రపంచ చెద నియంత్రణ యొక్క ప్రాముఖ్యత, పంటలకు, మానవులకు కీటకాల వల్ల కలిగే వివిధ సమస్యలు, అంశాలను వివరించారు. ప్రకాశరావు చిన్ని చిన్ని ఉదాహరణలతో చెద ఏ విధముగా మనకు ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నది, చెదల నుండి ఏ విధముగా పరిష్కార మార్గాలు, జాగ్రత్తలు తీసుకోవాలి, ఎదుర్కోవాలి అని చెప్పి వివరించారు. సివిల్ ఇంజనీర్స్ భవన నిర్మాణంలో నిర్మాణానికి ముందు, నిర్మాణం జరుగుతున్నప్పుడు, నిర్మాణం జరిగిన తర్వాత ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో చెదలు రాకుండా నివారించాలో డి.ప్రకాశరావు విపులంగా వివరించారు. కాలేజీ యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు డి.ప్రకాశరావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిషోర్, సీతమ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మొయిద సచివాలయ పరిధి పూతికపేటలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధిపొందారో వివరించారు. వైసీపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికలలో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, మండల కన్వీనర్ చనమల్లు వెంకట రమణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, నెల్లిమర్ల నగరపంచాయతీ కన్వీనర్ చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సర్పంచ్ లెంక మంగమ్మ, పెనుమత్స సంతోష్ బాబు, పతివాడ అప్పన్న, పీఏసీఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాయకులు లెంక గోవింద, డి గిరిబాబు, అట్టాడ కనకారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కృషి ఎనలేనిది: కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల కృషి ఎనలేనిదని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ నిశాంత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు హైజనిక్ కిట్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికులు నిర్వహించిన విధులు వెలకట్టలేనిదని కొనియాడారు. ఇటీవల జరిగిన ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ గ్రామ దేవతల ఉత్సవాలలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా వుంచడంలో పారిశుధ్య కార్మికులు కనబరచిన నిబద్ధతకు ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. బాధ్యతగా చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రజల్లో గౌరవం పెరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజా సహకారంతో స్వచ్ఛ జిల్లాగా అవతరించే దిశగా తోడ్పాటు అందించాలని కోరారు.

అనంతరం కలెక్టర్ పారిశుధ్య కార్మికులకు హైజనిక్ కిట్‌లను పంపిణీ చేశారు. కొత్తవలస కాలనీలో ఈదురు గాలులకు పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న నిరుపేదకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పటి, చిన్నారులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, ఎంసీఎం సభ్యులు బెలగాం జయబాబు, బోటు రామకృష్ణ, వి.ప్రకాష్, జిల్లా కో ఆర్డినేటర్ యమ్మల జనార్ధన రావు, స్వచ్ఛంద కార్యకర్తలు మునిసాయి, పూర్ణ చంద్రరావు, బి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం గ్రామాన్ని సందర్శించిన ఆర్డీఓ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులలో భాగంగా నిజమైన మైదాన (జిటి పనులు) పనులను పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. రీ సర్వే పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్వీ రమణ, రీసర్వే ఉప తహశీల్దార్ చిట్టమ్మ, మండల సర్వేయర్ శంకరరావు, ఆర్ఐ కరుణాకర్, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీను, నాగు తదితరులు పాల్గొన్నారు.

అంటిజోలలో ఇంటింటికి వైద్యం

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం మండలంలోని అంటిజోల గ్రామంలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ 92 మందికి వైద్య సేవలు అందించారు. బాలింతలకు పక్షవాతంతో బాధపడిన వాళ్ళ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా, మలేరియా బారిన పడకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను, సూరమ్మపేట గ్రామ పంచాయతీలో కోనేరు పనులను ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం తనిఖీ నిర్వహించారు. మస్టర్లు తనిఖీలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేతనదారులకు నిర్దేశించిన కూలీ డబ్బులు వచ్చే విధంగా రెండు పూటలా పనులు చేయాలని కోరారు. కొలతలు ప్రకారం పనులు చేయాలని కోరారు. వారితోపాటు ఉపాధి హామీ పథకం మండల స్టాఫ్, గ్రామ పెద్దలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలను సిద్ధం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతిపై మండల అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్ పంట సీజనుకు కావలసిన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు ఆన్లైన్లో రిజిస్ట్రేషను చేయించాలన్నారు. జిల్లాకు 17 వేల క్వింటాలు వరివిత్తనాలు కేటాయించగా ఇప్పటికే 14 వేల క్వింటాల విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు పంపించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయుటకు నిర్దేశించిన లక్ష్యం రెండువేల మూడువందల హెక్టార్లలో ప్లాంటేషను పూర్తిచేయాలని, ప్రతి ఒక్క ఎకరం ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాకు మంజూరు చేసిన 68 ఫిష్ ఆంధ్ర షాప్స్ ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.యస్.ఎన్.రెడ్డి, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న నెమలి మృతి

విశాలాంధ్ర - సీతంపేట: పులిగుమ్మి గ్రామంలో నాటు సారా నిర్మూలన నిమిత్తం సబ్ ఇన్స్పెక్టర్ నీలకంఠారావు తమ పోలీస్ బృందంతో వెళ్లిన సమయంలో గ్రామ సమీపంలో కాలుకి దెబ్బ తగిలి నెమలి కనిపించడంతో సీతంపేట స్టేషన్‌కి తీసుకువచ్చి అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాలకొండ రేంజ్ అధికారులు సమీపంలో ఉన్న బీట్ ఆఫీసర్ దాలి నాయుడుకి సమాచారం ఇచ్చారు. ఆయన నెమలిని తీసుకెళ్లి సపరియలు చేసి మంగళవారం ఉదయం వెటర్నరీ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించినప్పటికీ అనారోగ్యంతో దెబ్బ తగిలి నెమలి మృతి చెందిందని బీట్ ఆఫీసర్ దాలినాయుడు తెలిపారు. నెమలిని చిన్న బగ్గా అటవీ ప్రాంతం గుమ్మడ తోటల్లో నెమలికి పంచనామా జరిపి ఖననం చేయడం జరిగింది అని తెలిపారు.

10న రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కురుపాం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం మూడు దశాబ్దాలుగా శ్రీ షిర్డీ సాయి ద్వారకామాయి ఆలయంలో వెలసి పూజలు అందుకుంటున్న శ్రీ రేణుకా దేవి విగ్రహాన్ని ఈనెల 8, 9, 10 తేదీలలో ప్రతిష్టాపన చేయనున్నట్లు నిర్వాహకులు నెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8న విఘ్నేశ్వరుని పూజలు, ఆవాహనం రేణుక దేవి విగ్రహం తిరువీధి, కలశ యాత్ర, 9న ప్రత్యేక పూజలు, సామూహిక లలితా పారాయణం, హెూమం 10 శనివారం ఉదయం 7:35 నిమిషాలకు యంత్రం, విగ్రహాన్ని ప్రతిష్టాపన చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పూర్తి సమాచారం తయారు చేయాలి

ఐటీడీఏ పీవో కల్పన కుమారి

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల అన్ని శాఖల అధిపతులు సమగ్రంగా రిపోర్టులు తయారు చేసి అందజేయాలని పీవో కల్పనకుమారి అన్నారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అటవీ హక్కు పట్టాలకు సంబంధించి ఇంకా పెండింగులో ఉన్న అప్లికేషన్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గిరిభూమి వెబ్సైట్‌లో ఫొటోస్ అప్లోడ్ చేయాలన్నారు. అగ్రికల్చర్‌కి సంబంధించి ఈ క్రాప్ అప్లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. రైతు భరోసా పెండింగ్ పేమెంట్‌లను పరిష్కరించాలని అన్నారు. అన్ని విభాగాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, డీహెచ్‌వో సత్యనారాయణ రెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఈఈ మురళి, డీడీ నగేష్, తహశీల్దార్ నర్సింహమూర్తి, పీఏవో హరికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవోలు, గురుకులం సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం: రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం నిమిత్తం జూన్ 5వ తేదీ నుండి సెప్టెంబర్ 1వ తేదీ వరకు వివిధ దశల పోరాట కార్యక్రమాల పిలుపులో భాగంగా మొదటి దశ కార్యాచరణలో మంగళవారం ఎనిమిది

డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.ఉమామహేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరోధించాలని, పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జిఓఎంఎస్ నెం.117ను రద్దు చేయాలని, బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఎన్.బాలక్రిష్ణారావు, ఎస్.మురళీ మోహనరావు, శ్రీనివాసరావు, గోవింద నాయుడు, నర్సింగరావు, రమేష్, కూర్మినాయుడు, ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యులు గణపతిరావు, పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ ఏరియా ఆసుపత్రి సమావేశం

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా అన్ని ఆసుపత్రుల్లో డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆధార్ నెంబర్ ఫోన్ నెంబర్ సహాయంతో హెల్త్ ఐడి సృష్టించడం జరుగుతుందన్నారు. ఆధార్ నెంబర్ పాన్ నెంబర్ మాదిరిగా ఆయుష్మాన్ భారత్ వారి ద్వారా ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడి కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ నెంబర్ ద్వారా భవిష్యత్తులో చికిత్స కొనసాగుతుందని ఈ అవకాశం అందరూ వినియోగించుకోవాలని కోరారు. జూన్ 14న ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శ్రీ కోటదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారని ఈ రక్తదాన శిబిరానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాని కోరారు. .ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ నురల్ కమర్, కమిటీ మెంబర్‌లు ఎచ్చెర్ల జయరాం, రెడ్డి జయలక్ష్మి, కమిషనర్ సర్వేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణ్‌రావు, వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం పేరిట పట్టు బిగిస్తున్న టీడీపీ

గ్రామ గ్రామాన చాపకింద నీరులా సమావేశాలు
సుడిగాలి పర్యటనలు చేస్తున్న కోళ్ళ దంపతులు

విశాలాంధ్ర - వేపాడ: ఆత్మీయ సమ్మేళనం పేరిట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ దంపతులు గ్రామ గ్రామాన నమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను ఉత్సాహపరుస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దంపతులిద్దరూ సుడిగాలి పర్యటనలు చేస్తూ సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ అధినేత చంద్రబాబు మహానాడు సందర్భంగా రాజమండ్రిలో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను శ్రేణులతో పాటు ప్రజలకు వివరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది కాలవ్యవధి ఉన్నప్పటికీ ముందస్తుగానే నిరంతరం గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ చాపకింద నీరులా పార్టీని బలోపేతం చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు నల్లబిల్లి, వావిలపాడు శివారు గిరిజన గ్రామం కడకొండ, నీలకంఠరాజపురం, చినగుడిపాల, రామస్వామిపేట, కొండగంగు బూడి, వేపాడ, వల్లంపూడి తదితర గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం పేరిట నిర్వహిస్తున్న సమావేశాలలో టీడీపీ

అధికారంలోకి వస్తే చేసే మంచి పనులను వివరించారు. వైసీపీలోని అసంతృప్తులను గుర్తిస్తూ వారి మద్దతును ఆకాంక్షిస్తూ పార్టీ బలోపేతానికి గట్టి పునాదులు వేస్తున్నారు. గత అనుభవాలను బేరీజు వేసుకుంటూ తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. మంగళవారం మండల కేంద్రం వేపాడ, వల్లంపూడి గ్రామాలలో స్థానిక టీడీపీ నాయకులు నిరుజోగి బంగారునాయుడు, నిరుజోగి దాలినాయుడు మాస్టర్, నిరుజోగి ముత్యాలనాయుడు, గోకేడ సత్యం, రుద్ర అప్పలనాయుడు తదితరుల సారథ్యంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల రమణ, మండల పార్టీ అధ్యక్షులు కొట్యాడ రమణమూర్తిల అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదేశాల మేరకు నిర్వ హించిన సమావేశాలలో ప్రజలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనడం, ఆత్మీయంగా స్వాగతం పలకడం వల్ల గ్రామాల్లో టీడీపీ పట్టు సడలిపోలేదని స్పష్టమవుతోంది. ఇదిలా ఉండగా ఎన్నారై గొంప కృష్ణ చంద్రబాబు ఎస్.కోట వచ్చినపుడు చేసిన హడావిడి, ఇటీవల జన్మదినం పేరిట జరిపిన సమావేశం మినహా నేరుగా ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువేనని చెప్పాలి. ఎమ్మెల్యే టికెట్ పేరిట టీడీపీని రెండు వర్గాలుగా చీల్చి వైసీపీకి మేలుచేసే ధోరణి వల్ల పార్టీకి ఎంతోకొంత నష్టం తప్పదని పరిశీలకులు అంటున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ నాయకులు కొత్తవలస మండ లానికి చెందిన అర్జునరావు, రత్నాజీ, వేపాడ మండలానికి చెందిన చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లినాయుడు, గుంటుపల్లి దేముడునాయుడు, బోజంకి మహేష్, కోన సత్యం, కొప్పల అప్పారావు, గోకేడ అచ్చంనాయుడు (మద్దాలు), నాగభూషణం, వేచలపు జగ్గిబాబు, కొల్లి కన్నం నాయుడు వంటి టీడీపీ ముఖ్యనాయకులు అంతా పాల్గొంటూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

సీతారాముల భజన మందిరం ప్రతిష్ఠా మహోత్సవం

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మండలం బంటువానివలస గ్రామంలో ఈనెల10వ తేదీన శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉత్తరాయణం జ్యేష్ఠ బహుళ సప్తమి శనివారం నాటి ఉదయం గం. 7-30 ని.లకు శతభిషం నక్షత్రం, మిధున లగ్నం నందు శ్రీ సీతారాముల స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని రామ మందిరం కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలియజేశారు. 8వ తేది గురువారం ఉదయం గం. 9-00 లకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, సాయంత్రం గం. 14-00కు తిరువీది, అగ్ని ప్రతిష్ఠ, పాలాభిషేకం, జాలాదివాసం, 9వ తేది శుక్రవారం ఉదయం గం. 8-00 లకు నిత్యపూజ దేవతార్చన, సూర్యనమస్కారం, హెూమం, తీర్థప్రసాదం వితరణ, 10వ తేది శనివారం ఉదయం గం. 5-00 లకు నిత్యపూజ కళాన్యాసం, హెూమ అర్చన, స్వామివారి ప్రతిష్ఠ కళ్యాణం, ఆశీర్వచనం జరుగునని, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గం.ల నుండి మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

9న సాలూరు వెదురు డిపోలో కలప వేలం

విశాలాంధ్ర - పార్వతీపురం: సాలూరులో గల ప్రభుత్వ వెదురు అమ్మకం డిపో నందు ఈనెల 9న కలప వేలం జరుగుతుందని జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి.ప్రసూన తెలిపారు. డిపోనందు అమ్మకనకు సిద్ధంగా గల 35,24, 492 రూపాయలు విలువ గల 223 లాట్లలో గల 79. 18 క్యూబిక్ మీటర్ల 1389 దుంగలు, 33,519 రూపాయలు విలువగల 28 లాట్ లలో 24.40 క్యూబిక్ మీటర్ల 40 సాధారణ కలప దుంగలు, 1,60,670 రూపాయల విలువగల 3 లాట్లలో 9000 వేల వెదురు కర్రలు అమ్మకం నకు గలవని ఆశక్తి కలిగినవారు సాలూరు ప్రభుత్వ వెదురు అమ్మకండిపోనందు ఈనెల 9న జరిగే వేలంలో పాల్గొని కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

విశాలాంధ్ర - తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం ప్రతి విద్యార్థి అలవాటు చేసుకోవాలని రిటైర్డ్ ఎంఈఓ

ఎం.సత్యన్నారాయణ సూచించారు. తెర్లాం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు నైతిక విలువలు పెంచే పుస్తకాలు, నీతి కథలు, గురజాడ అప్పారావు కథలు, తెలుగు భాషా రచయితలు, కవులు, ప్రతి పుస్తకము పఠనం చేయడం వలన మంచి తెలివితేటలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

పథకాలు అమలులో వాలంటీర్లు రథసారథులు

విశాలాంధ్ర - దత్తిరాజేరు : పథకాలు అమలులో వాలంటీర్లు రథసారథులని మంగళవారం గడసాం గ్రామంలో వైస్ ఎంపీపీ ముత్తిరెడ్డి రమేష్ అన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం వాలంటీర్లకు సేవా మిత్ర , సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీతేటి దీపిక , ఎం లింగాలవలస సర్పంచ్ మజ్జి రామలక్ష్మి, కన్వీనర్లు నేతేటి వెంకటరమణ, మజ్జి అప్పలనాయుడు, పంచాయతీ అధికారి వాణిశ్రీ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు మంగళవారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ గిరిజన విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతుందని దీనికి రాష్ట్ర ప్రభుత్వానిదే ఎక్కువ బాధ్యత ఉందన్నారు. గత సం. యుటిఎఫ్ ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహించి గిరిజన విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అయినా ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. అలాగే స్థానిక అధికారులు కూడా ఉపాధ్యాయుల సమస్యలపైన తగు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులకు అనుకూలమైన అంశాలపై త్వరగా స్పందిస్తున్నారని ఉపాధ్యాయుల సమస్యలపై మాత్రం స్పందించడం లేదన్నారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో పిజి హెచ్ఎం పోస్టులు, ఎస్ఎ క్యాడర్ పోస్టులు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్, కె.భాస్కర్, వి.వెంకటి నాయుడు, ప్రశాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను జేసీ పరిశీలన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం పెదఖండేపల్లి, ధర్మవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియను ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తహశీల్దార్ డి.శ్రీనివాస రావు, సర్వే సిబ్బందికి సూచించారు. ఇక రీసర్వే ప్రక్రియలో భాగంగా మండలంలోని ధర్మవరం గ్రామ సచివాలయంలో జరుగుతున్న కంప్యూటర్ పనులను కూడా జేసీ పరిశీలించారు. అనంతరం వేములాపల్లి పంచాయతీ శివారు గత్రాజు కళ్ళాల వద్ద గల సర్వే నెంబరు 78/5లో ఉన్న 2.50 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పౌరసరఫరాల గొడౌన్ నిర్మాణ నిమిత్తం జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు. జేసీ వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ యాళ్ల రమణ, ఎంపీటీసీ బోదల దేముడు, మండల సర్వేయర్ సీహెచ్. వెంకటరావు, సర్వే అసిస్టెంట్లు, గ్రామపెద్దలు ఉన్నారు.

బాలాసోర్ ఘటన అత్యంత విషాధకరం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఒరిస్సాలోని బాలాసోర్ రైలు ప్రమాదం దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన దుర్ఘటన అని మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంటపాటి రుక్మిణి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మూడు కోవెల వద్ద గల ఆమె వాసంలో మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలాసోర్ ప్రమాదంలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ మహిళా అధ్యక్షురాలు రుక్మిణి మాట్లాడుతూ మానవ తప్పిదం వల్ల వందలమంది ప్రాణాలు బలికావడం అత్యంత విషాదకరమని అన్నారు. సంస్థ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.కిషోర్, కార్యదర్శి కె.వి.రమణమూర్తి, నేషనల్ మీడియా సెక్రటరీ రవికుమార్, ప్రతినిధులు పైడి నాయుడు, టి.శివ పార్వతి, వి.అనూష తదితరులు పాల్గొన్నారు.

గడప-గడపకూ మన ప్రభుత్వంలో కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలోని 27వ డివిజన్‌లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం సూర్య నగర్, జొన్న గుడ్డి తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. కాలువ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు వీధుల్లోకి వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులను పిలిచి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ తమ డివిజన్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొనడం

ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అలాగే ఇంటింటికి వెళ్తుంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ముఖ్యంగా మహిళలు తమ సంతోషాన్ని నాయకుల వద్ద వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూరిబాబు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, డీఈ అప్పారావు, దుప్పాడ అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించటమే ధ్యేయం

ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. తాల్లబురిడీ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు ప్రభుత్వానికి గొంతుకలని, ప్రభుత్వ సేవలను అందించడంలో ఏమాత్రం అలసత్వం వహించినా, అశ్రద్ధ చూపించినా ఎన్నో కుటుంబాలు వీధిన పడతాయని అన్నారు. కాబట్టి మీరంతా కూడా చాలా జాగ్రత్తగా మీ మీ విధులను సక్రమంగా నిర్వర్తించి, అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి కూడా ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బోమ్మి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మద్రాపు మంగమ్మ, సర్పంచ్ చప్ప రామకృష్ణ, కో ఆప్షన్ ఎంపీటీసీ షేక్ కరీం, మండల వైసీపీ సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి, మద్రాపు వాసు దేవరావు, మడక విశ్వనాథం, వి.గురు రాజు, పిఎసిఎస్ చైర్మన్ తీళ్ళ శివు న్నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పండు, జి.సతీష్, జె.ప్రవీణ్ కుమార్, నాయకులు పి.శ్రీనివాస రావు, ధనుంజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ కళాశాలలో పలువురికి బదిలీలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగమ్మపేట ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి. ధర్మరాజు జాయిన్ అయ్యారు. ఆయన అరకు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికల) ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ డిప్యూటేషన్‌పై కడప నుండి విచ్చేసి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పోల వెంకట నాయుడుకు అరకు బదిలీ జరగగా ఆయన రిలీవ్ అయ్యారు. ఇదిలా ఉండగా ఇక్కడ ఇంతవరకు ఆంగ్ల ఉపన్యాసకుడుగా పనిచేసిన ఈదుబిల్లి లక్షుంనాయుడుకు పి.కోనవలస రెసిడెన్షియల్ కళాశాలకు బదిలీ జరిగింది. ఆయన స్థానంలో పి. కోనవలస రెసిడెన్షియల్ కళాశాలలో ఆంగ్ల ఉపన్యాసకుడిగా పనిచేసిన ఏ.నాగభూషణ నాయుడు ఇక్కడ జాయిన్ అయ్యారు. ఇక్కడ తెలుగు జేఎల్ పోస్టు ఖాళీగా ఉండటంతో పెద్దమడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పనిచేసిన ఆర్ఎస్‌విజి కృష్ణారావు ఇక్కడ తెలుగు అధ్యాపకులుగా జాయిన్ అయ్యారు. ఇక్కడ జంతు శాస్త్రం జేఎల్ పోస్టు ఖాళీగా ఉండటంతో భద్రగిరి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న జి.తవిటినాయుడు ఇక్కడ జంతుశాస్త్ర అధ్యాపకులుగా జాయిన్ అయ్యారు.

కొమరాడ రెసిడెన్షియల్ స్కూల్లో పనిచేస్తున్న బలగ సింహాచలం ఇక్కడ ఇంగ్లీష్ (పి.జిటి) టీచర్‌గా జాయిన్ అయ్యారు. కొత్త ప్రిన్సిపాల్, కొత్తగా వచ్చిన అధ్యాపకులు ప్రతిభ కళాశాలలో ఉత్తమ పలితాలు సాధించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

17వ వార్డులో రహదారిని ప్రారంభించిన కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలోని 17వ డివిజన్ రాజీవ్ స్టేడియం నుండి క్యాటిల్ డిపో వరకు నూతనంగా ఏర్పాటు చేసిన రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ నగర అధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు ఆసపు వేణు మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి శరవేగంగా దూసుకుపోతుందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పలు ప్రాంతాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 18 లక్షల రూపాయలతో క్యాటిల్ డిపో ప్రాంతం వద్ద రహదారి నిర్మాణం చేపట్టడం ఎంతో అభినందనీయ మన్నారు. అలాగే నగరంలోని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశారని అన్నారు. ముఖ్యమంత్రి

వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుంటే, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభివృద్ధిని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, నగరపాలక సంస్థ ఈఈ కె.శ్రీనివాసరావు, కోరాడ తాతారావు, మద్దిల శ్రీను, వీరభద్రయ్య, నామాల సర్వేశ్వరరావు, ముద్దాడ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఎస్.సి గ్రూప్ సి ఉద్యోగాలకు 8లోగా దరఖాస్తులు

విశాలాంధ్ర - పార్వతీపురం: స్టాఫ్ సెలక్షన్ కమీషన్ గ్రూప్ "సి" ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామగోపాల్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. స్టాఫ్ సెలక్షన్ కమీషన్ కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) లెవెల్ పరీక్ష 2023ను నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. గ్రూప్ "సి" స్థాయిలో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల నియామకం ఉంటాయని, అందుకు ఆన్లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తుందని వివరించారు. గ్రూప్ "సి" ద్వారా జరిగే ఉద్యోగ నియామకాలు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, భారత ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజ్యా ంగ సంస్థలు, చట్టబద్ధమైన సంస్థలు, ట్రిబ్యునల్ మొదలైన శాఖలలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, పోస్టుల వివరాలకు సంబంధించిన సమాచారం, వయోపరిమితి, అవసరమైన విద్యార్హతలు, చెల్లించాల్సిన రుసుము, పరీక్ష విధానం ssc.nic.in/ SSC File Server /PortalManagement/ Uploadedfiles /notice_ CHSL_ 0905 2023.pdfను వెబ్ సైటులో చూడవచ్చని ఆయన చెప్పారు. ఆన్లైన్ లో ఈ నెల 8వ తేదీ లోగా దరఖాస్తులను సమర్పించాలని, ఆన్లైన్‌లో ఫీజును ఈ నెల 10వ తేదీ నాటికి చెల్లించవచ్చని ఆయన అన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష 2023 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ లో 10 కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఆసక్తి గల జిల్లా యువత గ్రూప్ "సి" పోస్టులకు దరఖాస్తు చేసి అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాల పునఃప్రారంభం నాటికి జెవికె కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - నెల్లిమర్ల: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ జి గిరిబాల అన్నారు. నెల్లిమర్ల మండలం సతివాడ ఆదర్శపాఠశాలలో మంగళవారం జెవికె కిట్లు పరిశీలించారు. రానున్న విద్యాసంవత్సరానికి విద్యార్థులకు జెవికె కిట్లు పూర్తి స్థాయిలో మండలానికి చేరాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఓ అంబళ్ల కృష్ణారావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌పై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలంలోని గూడిపువలసలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్బీకేల నుండి రైతులకి అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలు గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి కె.శిరీష పాల్గొని పచ్చిరొట్ట విత్తనాలు ఆవశ్యకత, ఇంట్లో దొరికే ధాన్యం, చిరుధాన్యం, అపరాలు, సుగంధ ద్రవ్యం, నూనె గింజలు కలిపి చల్లి 45-50 రోజులకు నేలలో కలియబెట్టుకుంటే నేల సారం వృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఏ.గనేశ్వర్ రాజు, విఏఏ సతీష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

బదిలీల వెబ్ ఆప్షన్ తేదీలను పొడిగించాలి

విశాలాంధ్ర - బెలగాం : ఉపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్ తేదీలను పొడిగించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆప్షన్ ఇచ్చుటకు రేపే చివరి రోజు అని, కానీ ఇంత వరకు వేకెన్సీ లిస్టులు పెట్టలేదని, ఆప్షన్ ఇచ్చుటకు నెట్ ఎనేబిల్ కాలేదని అన్నారు. కంపల్సరీ బదిలీ అయ్యే ఉపాధ్యాయుడు సుమారు 1800 ప్లేస్లుకి ఆప్సన్ ఇవ్వాలని, ఇది చాలా కష్టమని అందుకని మరో రెండు రోజులు ఆప్షన్ ఇచ్చుటకు తేదీలను పొడిగించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎస్.కోటకు చెందిన

సూర్యల్యాబ్ అధినేత, బీజేపీ సీనియర్ నాయకుడు డి.సూర్యారావు పిలుపునిచ్చారు. ఎస్.కోట మండలం కొట్టాం గ్రామంలోని శ్రీ కోటమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈఓ నాగేంద్రతో కలిసి సూర్యారావు పనస, జంబో నేరేడు, జామ, వేప తదితర మొక్కలను మంగళవారం నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, ఉద్యోగి శేఖర్, అర్చకులు జగన్నాథం పాల్గొన్నారు.

కవితాంజలి పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సమాజ హితం కోరేదే సాహిత్యం అని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి సహకారంతో వర్ధమాన రచయిత యడ్ల శ్రీనివాసరావు రాసిన కవితాంజలి పుస్తకాన్ని ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. రచయితలు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, మంచి విషయ వస్తువుతో రచనలు గావించి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు గురుప్రసాద్ మాట్లాడుతూ భాషతోనే మానవజాతి మనుగడ సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత యడ్ల శ్రీనివాస్, సాయికృష్ణా వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ పతివాడ నారాయణరావు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత కె.ప్రసాద్, కె ఈశ్వరప్రసాద్, యడ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఇద్దరు క్రీడాకారులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈనెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్

రాష్ట్రంలో డెహ్రాడూన్లో జరగబోయే జాతీయ తైక్వాండో పోటీలకు గగన్ సాగర్ దొర, భార్గవి మన రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురనా అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు వీరికి అభినందనలు తెలిపారు.

నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చు కోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి పథక సంచాలకులు పెద్దింటి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎం.ఆర్. నగర్, పార్వతీపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసినటువంటి స్కిల్ హబ్‌లో కోర్స్ ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఆర్ఎం డొమెస్టిక్ వాయిస్ కోర్సులో శిక్షణ పొందిన యువతీ, యువకులకు జిల్లా గ్రామీణాభివృద్ధి పథకాలు సంచాలకులు పెద్దింటి కిరణ్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి స్పెషల్ ఆఫీసర్ పి.వినోద్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, కళాశాల ప్రిన్సిపల్ విలియమ్ క్యారీ, ఇతర జిల్లా నైపుణ్యాభివృద్ధి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కోటమ్మతల్లి ఆలయానికి ఆర్వో ప్లాంట్ వితరణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిల్లా ప్రజల ఇలవేల్పు, కొట్టాం గ్రామదేవత శ్రీ కోటమ్మతల్లి వారి ఆలయానికి ఎస్.కోట పట్టణానికి చెందిన శ్రీ సూర్య ల్యాబ్ అధినేత, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు దొడ్డి సూర్యారావు, వారి కుటుంబ సభ్యులు రూ.45 వేలు విలువైన మంచినీటి ఆర్వో ప్లాంటును ఆలయ ఈవో నాగేంద్రకు మంగళవారం అందజేశారు. అనంతరం భక్తులకి ఆర్వో ప్లాంటు ద్వారా శుద్ధ జలాలను పంపిణీ చేశారు. సూర్యల్యాబ్ అధినేత డి.సూర్యారావు మాట్లాడుతూ భక్తుల కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా పిలుచుకునే కొట్టాంలోని శ్రీ కోటమ్మతల్లి ఆలయానికి దేశ నలుమూలల నుంచి భక్తులు వచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకుని ఆశిస్సులు పొందుతారని గుర్తు చేశారు.

322 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీకి కమిటీ ఆమోదం

విశాలాంధ్ర - విజయనగరం: 2023-24 సంవత్సరాల కాలపరిమితికి గాను విజయనగరం జిల్లాలో పని చేస్తున్న 322 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీకి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ అధ్యక్షతన మంగళవారం తన ఛాంబర్లో జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఆన్‌లైన్ ప్రక్రియలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ, జీవో నెం.38లో పేర్కొన్న నిబంధనలు, జర్నలిస్టుల అర్హతా ప్రమాణాలు తదితర అంశాలపై చర్చ సాగింది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర విభాగాల నుంచి జిల్లా వ్యాప్తంగా 385 మంది దరఖాస్తు చేసుకోగా జీవో నెం.38 నిబంధనల మేరకు అన్ని అర్హతలున్న 322 మందికి తొలి విడతలో అవకాశం కల్పిస్తూ కమిటీ అంగీకారం తెలిపింది. వారిలో పెద్ద, చిన్న తరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి 165, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 122, ఫ్రీలాన్స్, వెటరన్, ఇతర విభాగాల 35 మంది జర్నలిస్టులు ఉన్నారు.

సమావేశంలో భాగంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.రమేష్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, పరిశీలన, జీవో నెం.38లోని నియమ నిబంధనలు, ఇతర అంశాల గురించి సభ్యులకు వివరించారు. జీవో నెం.38 ప్రకారం అర్హత కలిగిన జర్నలిస్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించగా అక్రిడిటేషన్ల జారీ చేయాలని పేర్కొంటూ సభ్యులందరూ సమ్మతి తెలిపారు. చిన్న పత్రికలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ ప్రాతిపదికన అదనంగా మరొక రెండు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, స్టేట్ బస్సు పాస్ ఉన్నవారికి ఏసీ బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించాలని కోరుతూ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ వారికి జిల్లా కలెక్టర్, విజయనగరం వారి ద్వారా లేఖ రాయాలని కమిటీ సభ్యులు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనారాయణ, మరో ఉన్నతాధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్ అప్పలరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, ఇతర కమిటీ సభ్యులు ఎ.సూరిబాబు(సాక్షి), కె.రమేష్ నాయుడు(ప్రజాశక్తి), ఎం.ఎం.ఎల్. నాయుడు (10టీవీ), వి. వెంకట జగన్నాథరావు (ఎన్.టి.వి.), కె.జె.శర్మ (అక్షర కెరటం), బి. జోగారావు (ఆంధ్రజ్యోతి) తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండే విధంగా గృహ సముదాయాల వద్ద త్వరితగతిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని టిడ్కో అధికారులకు హౌసింగ్ కమిటీ సూచించింది. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడ్కో నగరపాలక సంస్థ అధికారులతో హౌసింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. హౌసింగ్ కమిటీ సభ్యులు మరియు ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ నగరంలో సారిపల్లి, సోనియా నగర్ ప్రాంతాలలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల వద్ద ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా సముదాయాల వద్ద ప్రస్తుతం నెలకొన్న సమస్యల పైన వివరిస్తూ వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా సారిపల్లి ప్రాంతంలో ఇప్పటికే అనేకమంది గృహ లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసి అక్కడ నివాసం ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే తాగునీటికి నెలకొన్న ఇబ్బందులు పై రాజేష్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు నీటి పంపిణీకి అడ్డంకులు లేవని అన్ని సరి చేస్తామని చెప్పారు. నిత్యవసర సరుకులను అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. అలాగే సోనియా నగర్ లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. సమావేశాన్ని ఉద్దేశించి హౌసింగ్ కమిటీ సభ్యులు మరియు కార్పొరేటర్ తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నివాసయోగ్యానికి అనుకూలంగా లేని విధంగా ఇళ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు ఇబ్బందులు పాలు చేశారని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో సోనియా నగర్, సారిపల్లి వద్ద అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. దీంతో ప్రస్తుతం లబ్ధిదారులు కొంతమంది ఆయా ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు. వారికి అవసరమైన సదుపాయాలను కనిపిస్తూనే సోనియా నగర్ వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు

అధికారులు చొరవ చూపాలని అన్నారు. టిడ్కో ఈఈ ఎస్.జ్యోతి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ సముదాయాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే అందరికీ ఇల్లు అందజేసే విధంగా చూస్తామన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు గాదం మురళి, టిడ్కో ఏఈలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆకారం కోల్పోయిన తోటపల్లి పిల్ల కాలువలు

విశాలాంధ్ర - వంగర: ఇవి కాలువలేనా...? అన్నంతగా తోటపల్లి కుడి ప్రధాన కాల్వలు నుంచి ఆయా అయుకట్టు పొలాలకు వెళ్లే పిల్ల కాలువలు కనిపించనంతగా పూర్తిగా తుప్పలు, డొంకలతో పూర్తిగా పూడుకుపోయాయి. తోటపల్లి కుడి ప్రధాన కాల్వ నుండి ప్రతీ గ్రామానికి వెళ్లే (ఉప) కాల్వలు పూర్తిగా పూడుకుపోయి కనిపిస్తున్నాయి. కాల్వలు పూర్తిగా పాడవ్వటంతో ఆయకట్టు పొలాలకు సకాలంలో నీరు అందటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఈ మండలంనకు సంబంధించినంత వరకూ ఎక్కడ చూసినా పూర్తిగా కాల్వలు, ఆ కాల్వల నుంచి నీరు సరఫరాకు ఆటంకం కలిగేవిధంగా తయారయ్యాయి. మండలంలో వీవీఆర్ పేట, జేకేగుమ్మడ, పెద రాజులగుమ్మడ, చినరా, రుశింగి, కొప్పరవలస, బంగారువలస, తలగాం, కొత్తవలస, మద్దివలస, ఎం.శీతా రాంపురం, వంగర, శివ్వాం, తదితర గ్రామాలకు తోటపల్లి కుడి కాల్వ ద్వారా పిల్ల కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వలకు గత కొన్నేళ్లుగా పూర్తిగా మరమ్మతు పనులు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వలు ఇలా తయారవ్వటంతో ఖరీఫ్ వరిపంట సమయంలో ఆయా రైతులు ఏకమై స్వచ్ఛందగా కావున్నటువంటి మొక్కలు, చెత్తా, చదరాన్ని తొలగిస్తుంటారు. ఈ విధంగా ప్రతీ ఏడాది కూడా వీవీ అర్ పేట, జెకే గుమ్మడ గ్రామాలు ఆయకట్టు రైతులు స్వంతంగా పూడుకను తొలగిస్తూ పంట పొలాలకు సాగు నీరును అందేటట్లు చేసుకొంటారు.

వైద్య కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర - కురుపాం: ప్రతీ ఆరోగ్య కార్యక్రమంపైన వైద్య సిబ్బంది అవగాహన పెంపొందించుకుని పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యేలా కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మంగళవారం ఆయన దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాల్లో పాల్గొని పలు సూచనలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రతీ ఆరోగ్య కార్యక్రమం, నవీకరణ చెందుతున్న యాప్‌లు, తదితర అంశాలపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించి, అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణీలు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను వెంటనే గుర్తించాలని, ఫలితంగా ప్రమాదకర స్థితికి చేరకుండా జాగ్రత పడవచ్చన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐడిసిఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఓ ఆర్ ఎస్, జింక్ కార్నర్‌లను అవసరమైన అన్ని చోట్లా ఏర్పాటు చేసి డయేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సాధారణ ప్రసావాలు పై గర్భిణీలు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇ-ఆశా యాప్ లో ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామ ఆరోగ్య, పారిశుధ్య,పోషకాహార కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించా లన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముందస్తు సమాచారాన్ని గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు. వైద్యాధికారులు

డాక్టర్ బివిఎస్ స్వాతి, డాక్టర్ ఎమ్.వినోద్ కుమార్, సూపర్ వైజర్స్ రమణ, శ్రీనివాస్, సుగుణ, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - కొమరాడ/జెలగాం: గిరిజన సంఘం ఆధ్వర్యంలో జల, గుజ్జా బిడి, ధరసంగి గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించే విధంగా బోర్లు తీయాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కి వినతి పత్రం మంగళవారం అందించారు. కలెక్టర్ నిశాంతి కుమార్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి పత్రిక విలేకరులతో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు మండంగి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజు అధికారులు మంచినీటి సమస్య లేకుండా చేస్తాం అంటూ పత్రిక ప్రకటన మీద ప్రకటన ఇస్తున్నారే తప్ప నేటికీ కొన్ని గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించడంలో అధికారులకు చిత్తశుద్ధి లేదని అన్నారు. ఉదాహరణకు కొమరాడ మండలానికి సంబంధించి పెద్ద శాఖ పంచాయతీ పరిధిలో జల, గుజ్జా బిడి, ధరసంగి గ్రామాలకు గాను మంచినీరు బోర్లు లేకపోవడంతో సమీప గెడ్డ ద్దలో నుండి బురద, కలుషితమైన నీరు తెచ్చుకోవడంతో ఇప్పటికే అనేకమంది గిరిజన ప్రజలు జ్వరాలు పాలయ్యే పరిస్థితి ఉందని అలాగే పై గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ కూడా మంచి నీరు బోరు వేస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటికీ వేయకపోవడం చాలా అన్యాయమని అన్నారు. దీనివల్ల గిరిజన ప్రజలు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని ఈ విషయంపైన కొమరాడ ఎంపిడివో కార్యాలయం వద్ద అనేకసార్లు నిరసన కార్యక్రమం చేసిన సందర్భంలో అధికారులు వచ్చి చూసి వెళ్లడమే తప్ప ఎటువంటి పరిష్కారం లేదని అలాగే సచివాలయం సిబ్బంది కూడా ఈ గ్రామాలకు మంచినీరు లేకపోవడంతో చూసి చూడనట్లు వ్యవహరించడం సరికాదని కావున దీనికి నిరసనగా మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది కావున ఇప్పటికైనా పై గిరిజన గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించే విధంగా బోర్లు వేయాలని కోరుతున్నాం లేనియెడల ఇంకా ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గిరిజన గ్రామానికి సంబంధించిన మధు, సురేష్, గణేష్, నరసింహ, సోమరాజు, చెంబు నాగు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థల సహకారం వుండాలి

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్ సమావేశ మందిరములో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమము సిబ్బందితో సమీక్ష సమావేశము నిర్వహించడము జరిగినది. ఈ కార్యక్రమములో బాగముగా డా. ఎన్. సూర్య నారాయణ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ మరియు లెప్రసి) వారు మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని, వీధి నిర్వహణలో నిర్లక్ష్యము వహించొద్దని తెలియజేశారు. హెచ్. ఐ. వి నివారణలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమములో డా. ఎన్. సూర్య నారాయణ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ మరియు లెప్రసి), విజయనగరం, పి. బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఎన్. సాక్షి గోపాల రావు, జిల్లా సూపర్వైసర్, డి. నాగరాజు, టి.బి సూపర్వైసర్ మరియు డి. రామనాయుడు, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థలు విజయనగరం మరియు మన్యం జిల్లా పాల్గొన్నారు

నేడు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహాల ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మంగళవారం తెలియజేసారు. కాగా మంగళవారం రాత్రి ఎస్.కోట పట్టణంలోని పురవీధుల్లో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, అమ్మవార్ల విగ్రహాలను బాణాసంచా కాల్పులు, విద్యుత్ కాంతుల నడుమ వైభవంగా ఊరేగించారు. ఊరేగింపు, పూజా కార్యక్రమాల్లో విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: ఆంజనేయస్వామి ఆలయం స్థలాన్ని ఆక్రమించిన వారిపై యంత్రాంగం చర్యలు తీసుకోవాలని బిజెపి నెల్లిమర్ల నియోజకవర్గ కన్వీనర్ బూర్లే శ్రీధర్ డిమాండ్ చేశారు. కబ్జా చేసిన ఆలయ స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి చంద్రబాబు నాయుడు నగర్ కాలనీలో ఆరు సంవత్సరాల క్రితం ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఆలయ స్థలాన్ని బంగార్రాజు అనే వ్యక్తి కబ్జా చేసి స్థానికులను ఆలయంలో పూజలు చేయకుండా పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. తక్షణమే రెవెన్యూ యంత్రాంగం స్పందించి ఆక్రమణల చెరనుంచి ఆంజనేయ స్వామి గుడిని కాపాడి యథాతథంగా పూజలు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

8న ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర - జెలగాం : ఐటిడిఎ పార్వతీపురం ఆధ్వర్యంలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల యందు 2023-24 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు ఆంగ్లమాధ్యమంలో ప్రవేశం కొరకు తేది.31.05.2023 లోగా ఆన్ లైన్ వెబ్ సైట్ ఓఓఓఖజఆఓన్రబతీబఎబశ్రీఖఎఖజా.న్రశీజ.ఱఅ ద్వారా ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆం.ప్ర. గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఎస్టి., ఎస్సి, బిసి, ఒసి కులాలకు చెందిన విద్యార్థులు కౌన్సిలింగ్ జరుగు తేది.08.06.2023 (గురువారం) ఉదయం 10 గంటలకు పార్వతీపురం ఐటిడిఎ గిరిమిత్ర మీటింగ్ హాల్ నందు హాజరు కావలెనని పార్వతీపురం ఐటిడిఎ పిఓ ఒక ప్రకటనలో తెలిపారు.

కోటి రూపాయల నిధులతో సాకిగెడ్డ వంతెన నిర్మాణం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: సాకి గెడ్డపై కోటి రూపాయల నిధులతో వంతెన నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ వంతెన నిర్మాణం వలన తాళ్లబురిడీ గ్రాముతో పాటు ములగ చుట్టుపక్కల 11 గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఈ వంతెన ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం

చేస్తున్నారన్నారు. వంతెన నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సంబందించిన అధికారులకు ఆదేశించడంతో పాటు నిర్మాణం పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట నుండి తెర్లాంకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోటకోట డిపో నుంచి తెర్లాంకు ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 11.30 గంటలకు ఎస్.కోటలో బయలుదేరి విశాఖ, విజయనగరం మీదుగా చీపురుపల్లి వెళ్లి తిరిగి విశాఖ చేరుకొని సాయంత్రం 07.00 గంటలకు విశాఖలో బయలుదేరి విజయనగరం, గజపతినగరం, మానాపురం, భైరిపురం, మెరకముడిదాం మరియు ఉత్తరావిల్లి మీదుగా తెర్లాం రాత్రి 10.00 గంటలకు చేరుతుంది. మరునాడు ఉదయం తెర్లాంలో 05.00 గంటలకు బయలుదేరి అదే రూట్లో విశాఖ 08.05 గంటలకు చేరి ఎస్.కోట కు 09.45 వస్తుందని, ఈ సౌకర్యాన్ని ప్రజలందరూ వినియోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించవలసినదిగా డిపో మేనేజర్ కె.రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

నేడు ఎల్.కోటలో టీడీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం

- నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం, నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి నివాసం వద్ద బుధవారం (07-06-2023) జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇంఛార్జ్ లు, యూనిట్ ఇంఛార్జ్ లు, బూత్ ఇంఛార్జ్ లు, సెక్షన్ ఇంఛార్జ్ లు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, నియోజకవర్గంలోని వివిధ హెూదాల్లో ఉన్న అన్ని అనుబంధ సంఘాల నాయకులు, ఐటిడిపి సభ్యులు, బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ వర్గాల నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొనాలని పేర్కొన్నారు.

బాగింపేట స్థల వివాదంపై సీఐ దర్యాప్తు

విశాలాంధ్ర - వంగర: మండలంలో భాగింపేట గ్రామంలో ఇంటి స్థల వివాదంపై మంగళవారం రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు దర్యాప్తు చేశారు. బాగంపేట గ్రామానికి చెందిన రెడ్డి వల్లభ నాయుడు తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేశారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిఐ దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా సీఐ ఉపేంద్ర గ్రామస్తులు వద్ద పూర్తి వివరాలు సేకరించారు. ఫిర్యాదుదారుడు తన ఇంటి స్థలాన్ని తనకు అప్పగించేటట్లు చూడాలని వల్లబ నాయుడు విజ్ఞప్తి చేశారు.ఈయన వెంట స్థానిక ఎస్ ఐ జనార్ధన నాయుడు, సిబ్బంది వున్నారు.

భార్యపై భర్త దాడి

విశాలాంధ్ర - జెలగాం : భార్యపై భర్త దాడి చేయడంతో గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకిడివరం గ్రామానికి చెందిన బలగ దేవి కూలిపని చేసుకొంటూవుంటాది. పెళ్ళయింది ఇద్దరు అబ్బాయిలు. సోమవారం రాత్రి తన భర్తతో గ్రామంలో తోటి కోడలు వాళ్ళందరూ కోలాటం ఆడుతున్నారు నేను కూడా వెళుతానని చెప్పగా నీ ఇష్టం వెళ్లులే అన్నాడు. తను కోలాటానికి వెళ్లి తిరిగి రాగా ఎవడికి అడిగి కోలాటం ఆడడానికి వెళ్ళావే, నీకు ఎవరు రమ్మన్నారే అని దేవిని రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంటి ముందు రోడ్డుపై గుండెపై తన్ని రెండు చెంపలపైన వీపుపై కొట్టాడు. దీనితో పైకి కనిపించని కవుకు గాయాలయ్యాయి. తన భర్తకు అనుమానం ఎక్కువ. ఊరిలో గత

4సం.లుగా గ్రామంలో ఒక అమ్మాయితో అక్రమ సంబంధం ఉంది. గాయపడిన ఆమెను మంగళవారం ఉదయం ఆమె తల్లి కుమ్మరిగుంట నుండి వచ్చి ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.